# సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

: వేల్పుల కుమారస్వామి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ఈనెల 7 నుండి 9వరకు మెదక్ పట్టణంలో జరిగే సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ ప్లంబర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం ఆర్. పరమేష్ అధ్యక్షతన నిర్వహించగా, వేల్పుల కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో కార్మిక సమస్యలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చ జరగనుండగా, భవిష్యత్ పోరాట కార్యాచరణ సిద్ధమవుతుందని తెలిపారు. మొదటి రోజు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బి.వి. రాఘవులు, సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు కె. హేమలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సాయి బాబు, నేతలు పాలడుగు భాస్కర్, ఎస్. వీరయ్య, ఎస్.వి. రమ, వంగూరు రాములు తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సభలకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అధ్యక్షత వహిస్తారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రతినిధుల సభ నిర్వహించబడుతుందని, రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్, కిశన్, సదయ్య, సుదర్శన్, జే. బాబు, రాజు, దీక్షిత్, అంజత్, హైమద్, అవినాష్, మదు, మల్లేష్, కొమురయ్య, కుమార్, కనకయ్య, శ్రీనివాస్, మొగిలి, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు పునరుద్ధరణ

ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషితో కీలక పురోగతి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పునరుద్ధరించబడుతూ మరో దశ ముందుకుసాగిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖతో నిరంతరం చర్చలు జరుపుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తొలుత పరిశీలించిన లొకేషన్‌లో కొండలు, అడ్డంకులు ఉండటంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆ ప్రదేశాన్ని తిరస్కరించినట్లు ఎంపీ వివరించారు. దీనితో, కొత్త లొకేషన్‌పై ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ చేయడానికి మళ్లీ ఒత్తిడి చేసి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ స్టడీ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ. 50 లక్షలు సెంటర్‌కు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రీ-ఫీజిబిలిటీ ప్రక్రియ వేగవంతం కావడానికి నేడు కూడా సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి చర్చించినట్లు వంశీకృష్ణ తెలిపారు. డిసెంబర్ 3 లేదా 4 తేదీల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టీమ్ రామగుండం ప్రాంతానికి వచ్చి కొత్త భూమిని పరిశీలించనుందని ఆయన పేర్కొన్నారు. స్టడీ పూర్తైన వెంటనే భూసేకరణ, తుది నిర్ణయాల దిశగా ముందడుగు పడుతుందని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు ద్వారా రామగుండం, ఎన్టీపీసీ, సింగరేణి ప్రాంతాలు మాత్రమే కాకుండా పెద్దపల్లి, మంచిర్యాల్, ఆదిలాబాద్ జిల్లాలకు కూడా భారీగా లాభం చేకూరుతుందని ఎంపీ అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. "ప్రాంతీయ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు. ప్రజల ఆశీర్వాదంతో రామగుండంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పడే వరకూ నా కృషి కొనసాగుతుంది" అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.



## రామగుండం అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషి విశేషం

డిసెంబర్ 4న ఆత్మీయ అభినందన సభ

బొంతల రాజేష్

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** రామగుండం పట్టణ అభివృద్ధిని గణనీయంగా ముందుకు తీసుకువెళ్లే రెండు కీలక విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం పట్ల ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌గారిని అభినందించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రాంతంలో 1ఐ800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, అలాగే మేడిపల్లి ఓ సి పి4 వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే నిరంతర శ్రమ ఫలితమిదేనని ఆయన పేర్కొన్నారు. పట్టణ భవిష్యత్ అభివృద్ధికి ఈ రెండు ప్రాజెక్టులు నాంది కావనున్నాయని అన్నారు. అభినందన సభ డిసెంబర్ 4 (గురువారం) సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు డిసెంబర్ 2 ఉదయం 10:30 గంటలకు గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అత్యవసర సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ కార్యవర్గం, విభాగాధ్యక్షులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని బొంతల రాజేష్ పిలుపునిచ్చారు.

## చిన్నారి హత్య కేసు ఛేదించిన పోలీసులు

ఇద్దరు నిందితుల అరెస్ట్

రామగుండం కమిషనరేట్ పోలీసులు వేగవంతమైన దర్యాప్తు



**అగ్నిధార న్యూస్,( రామగుండం) :** దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక మిస్సింగ్ , హత్య కేసును రామగుండం పోలీస్ కమిషనరేట్ వేగంగా ఛేదించింది. కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలతో, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పర్యవేక్షణలో, ఏసీపీ ఆర్.ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన నాలుగు ప్రత్యేక బృందాలు నిందితులను అరెస్ట్ చేయగలిగాయి. నవంబర్ 27న బాలిక శవం కొక్కెర మల్లయ్య బావిలో కనిపించిన అనంతరం పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. కేసులో ప్రధాన నిందితులైన శనిగారపు బాపు (52), ఉపారపు సతీష్ (40) ఇద్దరూ నవంబర్ 24న బాలికపై దారుణంగా దాడి చేసి, అనంతరం హతమార్చి బావిలో పడేశారని విచారణలో వెల్లడైంది. పోలీసుల గట్టి వలలో చిక్కిన నిందితులు డిసెంబర్ 1 ఉదయం మాదాపూర్‌లోని శ్రీ సిద్ధి వినాయక హనుమాన్ టెంపుల్ వద్ద అరెస్ట్ అయ్యారు. వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లు, మద్యం సీసాలు, బట్టలు, చిప్స్ పాకెట్, అలాగే బాధితురాలి గాజులు, పట్టాగొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ రమణమూర్తి, ఎస్ఐలు తాహేశీనుద్దీన్, సురేష్, అనూషతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు గౌస్, గంగనాయక్, వసంత్, జహీర్, ఆనంద్ తదితరుల కృషిని డీసీపీ భాస్కర్ ప్రశంసించారు. రామగుండం కమిషనరేట్ పోలీసులు అత్యంత క్రూరమైన ఈ నేరాన్ని త్వరితగతిన ఛేదించి, నిందితులను న్యాయానికి అప్పగించారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



**అగ్ని ధార న్యూస్, ( రామగుండం) :** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలకు శాంతిభద్రతలను పటిష్టం చేసేందుకు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా రంగంలోకి దిగి, మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంజపడుగు, రచ్చపల్లి గ్రామాల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం రోజున పరిశీలించారు. ప్రతి కేంద్రంలో పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన కమీషనర్, ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ రోజు ప్రజలు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ వ్యవస్థ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. అవసరమైన చోట అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఏ చర్యలకైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పార్టీలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు శాంతి భద్రతలను, చట్టపరమైన నిబంధనలను, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఎం. రమేష్, సీఐ బి. రాజు, ఎస్ఐలు రమేష్, సాగర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సేవనంపై, డీజేడ్రోన్‌లపై ఆంక్షలు కొనసాగింపు

: రామగుండం సిపి



**అగ్ని ధార న్యూస్ (రామగుండం):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై అమల్లో ఉన్న నిషేధాన్ని జనవరి 1, 2026 వరకు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ మహిళలు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిషేధం ఉల్లంఘిస్తే బి.ఎన్.ఎస్ 223, సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. డీజే సౌండ్స్, అనుమతి లేని డ్రోన్‌ల వినియోగంపైనా ఇదే గడువుతో ఆంక్షలు కొనసాగుతాయి. కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసిపిల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అదే విధంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

## ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికైన రమేష్ నాయక్ ని సన్మానించిన నిఖిల్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** ఉరుకొండ మండలంలోని గుండ్ల గుంట పల్లి గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ నీ అభినందించి సన్మానించిన మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి

## రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జడ్పీహెచ్ఎస్ మార్చాల క్రీడాకారిణి ఎంపిక



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో యం జె పి జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ బాలికల సెలక్షన్స్ లో డి. మౌనిక పదవ తరగతి జెడ్పిహెచ్ఎస్ మార్చాలా క్రీడాకారిని పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగినది ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలు డిసెంబర్ 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలోని హాలియా లో జరుగుతున్న 51వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలలో నాగర్ కర్నూల్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిథ్యం వహిస్తుందని పాఠశాల ప్రధానో పాధ్యాయులు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు యాదయ్య గౌడ్ తెలిపారు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారిణి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## గ్రామ పాలన అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జె.వినయ్ ఎన్నిక



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నాగర్ కర్నూల్ జిల్లా గ్రామ పాలన అధికారుల ఆవిర్భావ సభ తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ మరియు తెలంగాణ తాసిల్దారుల అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా నేతృత్వంలో జరిగిన ఇట్టి ఆవిర్భావ సభలో ఊర్కొండ మండలం రెడ్యాతండాకు చెందిన వినయ్ వెల్దండ మండల కేంద్రంలోని కొట్ర క్లస్టర్ గ్రామ పాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినయ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వినయ్ గతంలో కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షునిగా ఉంటూ విద్యార్థుల సమస్యలపై తన గళాన్ని వినిపించి గర్జించి పోరాటం చేశారు 2019 లో నిర్వహించిన విలేజ్ రెవెన్యూ అధికారి గా ఉద్యోగానికి ఎంపికయ్యారు. గతంలో ఎన్ఎస్యు ఐ విద్యార్థి సంఘంలో పని చేశారు,వినయ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తారని బలమైన విశ్వాసంతో వినయ్ ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## శబరిమలై వంశధారకులకు ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ఘన స్వాగతం



**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** కేరళ శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకుల వంశధారకులు సోమవారం రామగుండం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించడానికి వచ్చారు. స్థానిక శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ఆలయ ప్రాంగణంలో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శబరిమలై పరంపర భారతీయ ఆధ్యాత్మిక సంపదకు అద్భుతమైన ప్రతీకగా నిలుస్తోందని, దేశాన్ని ఆధ్యాత్మికంగా ఏకం చేసే శక్తి ఆ సంప్రదాయంలో ఉందని మనాలి ఠాకూర్ పేర్కొన్నారు. భక్తిపరమైన వాతావరణంలో జరిగిన ఈ దర్శనం స్థానిక భక్తులను ఆలయానికి ఆకర్షించింది.

